జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 11-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 780 పేజీలు: 4 వెల: రూ.7




# వంశధారకు.. గర్భశోకం!

* జేసీబీలతో ఇసుక తవ్వకాలు * పాతపట్నం నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు * ఒడిశాకు తరలిపోతున్న ఇసుక * జాడలేని మైనింగ్ అధికారులు * ఇసుకాసురులకు కొమ్ముకాస్తున్న నియోజకవర్గ నేత * ఆ నాయకునికి నెలకు లక్షల్లో ముడుపులు

కొత్తూరు, సెప్టెంబర్10 (వార్త): పాతపట్నం నియోజకవర్గం.. ఇసుకాసురులకు అడ్డాగా మారిపోయింది. వంశధార నది గర్భంలో ఇసుకను ఇష్టారాజ్యంగా, నిబంధనలు పాటించకుండా, పర్యావరణాన్ని పట్టించుకోకుండా పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వేస్తున్నారు. నదీ గర్భంలో తవ్వేస్తూ ఇసుకను ఒడిశాకు తరలించేస్తూ కాసులు చేసుకుంటున్నారు. పరిమితులకు మించి పట్టపగలు తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్ అధికారులు కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇసుక తవ్వకాలపై ఇటీవల కొన్ని పత్రికల్లో వెలువడిన కథనాల నేపథ్యంలో కొత్తూరు మండల తహసీల్దార్ స్పందించి ఆకులతంపర ర్యాంపులో ఉన్న కొన్ని వాహనాలను సీజ్ చేసి ఒక రూ.50 వేల జరిమానా విధించినట్లు సమాచారం. తహశీల్దార్ తనిఖీ చేసిన తర్వాత రోజునుంచే మళ్లీ యధావిధిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. "వ్యాపారం మాత్రం కోట్లలో.. జరిమానాలు మాత్రం వేలల్లో ఉంటే అక్రమ తవ్వకాలు చేస్తున్న వారికి భయం ఎలా వస్తుంది" అంటూ పలువురు విమర్శిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓ బడా నేత అనుచరుడి కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాల దందా జోరుగా సాగుతోంది. ప్రతినెలా భారీ మొత్తంలో ఆ నేతకు ముడుపులు అందుతున్నాయన్న ప్రచారం కూడా సాగుతోంది. తవ్వుకోండి.. మీ వెనుక నేనున్నానని ఆ బడా నేత హామీ ఇవ్వడంతో అనుచరులు ఇసుకను దోచేస్తున్నారు. వంశధార నది కేవలం ఇసుకకు నిల్వ కేంద్రం కాదని, దాని సహజ ప్రవాహం, నదీ పర్యావరణం, పరిసర ప్రాంతాల భవిష్యత్తుతో ముడిపడి ఉందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. విచ్చలవిడిగా తవ్వకాలు కొనసాగితే భవిష్యత్తులో నదీ ప్రవాహం, భూగర్భ జలాలు, పరిసర ప్రాంతాలపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని నదీతీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





కొత్తూరు మండలంలో వంశధార నదిలో ఇసుకను తవ్వేస్తున్న ఆ బడా నేత ఎవరు? అతనికి నెలకు ఎంత అందుతుంది? అధికారులకు సైతం ఎంతెంత ముడుపులు అందుతున్నాయి.. అన్న వివరాలను త్వరలో 'జాతీయ వార్త'లో..



# కొబ్బరి రైతుకు.. పురుగు పోటు

* కొమ్ముపురుగుతో నష్టపోతున్న కొబ్బరి చెట్లు * గున్న దశలో నేలకొరుగుతున్న చెట్లు * ఏళ్ల తరబడి కష్టపడి పెంచుతున్న రైతులు * తలలు పట్టుకుంటున్న ఉద్దానం రైతులు



సోంపేట, సెప్టెంబర్ 10 (వార్త): కొబ్బరి చెట్టు చక్కగా పెరిగితే ఇంట్లో పెద్ద కొడుకుతో సమానం అన్నది పెద్దల మాట. కొడుకు సహాయం ఎంతటిదో కొబ్బరి చెట్టు నుంచి వచ్చే ప్రతిఫలం అలాంటిది అని పెద్దలు పేర్కొన్నారు. కానీ కొన్నేళ్లుగా పరిస్థితులు తారుమారయ్యాయి. ఒకవైపు ప్రకృతి పగబట్టినట్లుగా తుఫానులతో కొబ్బరి తోటలు నేలకూలుతుంటే మరోవైపు ఎన్నో ఆశలు పెట్టుకొని భవిష్యత్తులో ఆదుకుంటుందన్న ఆశలతో ప్రాణంలా పెంచుకున్న కొబ్బరి మొక్కలు గున్న దశలోనే పురుగుల బారినపడి రైతుకు ఎటువంటి అనుమానం రాకుండా ఒక్కసారిగా నేలకూలుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగుతున్న కొబ్బరి పంట ఆయా రైతులకు కంట కన్నీరు తెప్పిస్తుంది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల పరిధిలో సుమారు ఎనిమిది వేల హెక్టార్లలో కొబ్బరి పంట సాగులో ఉంది. అనేక దశాబ్దాలుగా ఇదే పంటను నమ్ముకొని వేలాది కుటుంబాలు కష్టంగా జీవిస్తున్నాయి. తుఫాన్ల తాకిడితో కొబ్బరికాయలు కాచే చెట్లు నిలువునా నేలకొరగడంతో ఆయా చెట్ల స్థానంలో నాటిన కొబ్బరి మొక్కలు పెరిగి పెద్దవై కాపు వచ్చేందుకు కనీసం ఏడు ఎనిమిది సంవత్సరాలు పడుతుంది. అప్పటివరకు రైతులు వాటికి ఎన్నో సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. పశువుల గెత్తం వేస్తూ దుక్కులు చేపడుతూ సంరక్షిస్తున్నారు. పెట్టుబడులకు వెరవకుండా ఎన్ని చర్యలు చేపడుతున్నా పురుగుల బెడద కొబ్బరి మొక్కలను, చెట్లను నాశనం చేస్తుంది.

## రైతుకు శత్రువుగా మారిన కొమ్ము పురుగు..

వేలాదిమంది కొబ్బరి రైతులకు కొమ్ము పురుగు శత్రువులా మారింది. ఇది కొబ్బరి కాండం ద్వారా లోపలికి ప్రవేశించి రైతుకు తెలియకుండానే లోపలి భాగాన్ని గుజ్జు గుజ్జుగా నమిలి వేస్తూ వివిధ దశల్లో తన ప్రతాపాన్ని చూపిస్తూ గున్నదశలోనున్న కొబ్బరిని నిలువునా నాశనం చేస్తోంది. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గంలో కొబ్బరి తోటల్లో ప్రతి గ్రామంలోనూ ఇదే సమస్య రైతులను వెంటాడుతోంది.

## చోద్యం చూస్తున్న ఉద్యాన శాఖ..

ఉద్యాన పంటలను సంరక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. మొక్కుబడిగా ఏదో ఒకచోట రైతు సమావేశం నిర్వహించి చేతులు దులిపేసుకుంటున్నారు. పంటల పెంపకం పట్ల సరైన అవగాహన లేని సుమారు 90శాతం రైతులు కొమ్ము పురుగు తాకిడితో కొబ్బరిని కోల్పోతున్నారు.

## ఆదాయం కోల్పోతున్న రైతులు..

కాపునకు రావలసిన మొక్కలు నేలకొరగడంతో కొబ్బరి రైతులు ఆదాయాన్ని కోల్పోతున్నారు. అరకొర ఆదాయంతో కుటుంబాలను నెట్టుకు వస్తున్న పరిస్థితుల్లో రకరకాల తెగుళ్లు కొబ్బరిని ఆశించి పంటను నిలువునా నాశనం చేస్తున్నాయి. దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఒకవేళ కొబ్బరి ధర పెరిగినా దిగుబడి లేకపోవడంతో రైతులకు ఆదాయం లేక వేలాది కొబ్బరి కుటుంబాలు కష్టాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

## పట్టించుకోని ప్రభుత్వం..

జిల్లాలో వేలాదిమంది రైతు కుటుంబాలు కొబ్బరిని నమ్ముకుని జీవితాలు నెట్టుకు వస్తున్నప్పటికీ కొబ్బరి అభివృద్ధిపై ప్రభుత్వం తీవ్రంగా అశ్రద్ధ కనబరుస్తుందని రైతాంగం విమర్శిస్తోంది. కొబ్బరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో సరైన సమన్వయం లేకపోవడంతో కొబ్బరి అభివృద్ధి బోర్డు కూడా ఇటువైపు కనీసం తొంగి చూడడం లేదు. ప్రజా ప్రతినిధులు కూడా కొబ్బరి అభివృద్ధి బోర్డుని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో కొబ్బరి రైతు మరింత అప్పుల పాలవ్వడం తప్ప అభివృద్ధి దిశలో పయనించే పరిస్థితి లేకపోలేదు. కొబ్బరి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన చికోఫ్ సంస్థకూ, ప్రజా ప్రతినిధులకు అస్సలు పొంతన లేకపోవడం రైతులకు శాపంగా మారింది.

కరెంటు కోతలపై..

# కొవ్వొత్తులతో నిరసన

సోంపేట, సెప్టెంబర్10(వార్త):ఎడాపెడా కరెంటు కోతలతో విసిగెత్తిపోతున్న ప్రజలు రాత్రివేళ విద్యుత్ శాఖ తీరుపై కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. గత వారం రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరా గంటల కొలది నిలిపివేయడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై గ్రామీణ, పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఉప్పలాం గ్రామంలో మహిళలు, విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పుక్కల్ల అరేలమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఘాటుగా విమర్శించారు. చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యం బారిన పడిన వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గంటల కొలది విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. విద్యుత్ శాఖ ఇప్పటికైనా సక్రమంగా సరఫరా చేయాలని లేనియెడల ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ద్విచక్ర వాహనాల స్వాధీనం

## యజమానులు పూర్తి సమాచారంతో సంప్రదిస్తే అప్పగింత : ఎస్సై

**సోంపేట, సెప్టెంబరు 10(వార్త):** సోంపేటలోని పలు ప్రధాన కూడళ్ళలో దీర్ఘకాలికంగా పార్కింగ్ చేసి విడిచిపెట్టిన ద్విచక్ర వాహనాలను స్థానిక ఎస్సై మోహిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని గాంధీ మండపం కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలి లో పార్కింగ్ చేసిన వాహనాలు వివిధ సమస్యలకు కారణంగా మారాయి. వీటిని సంబంధిత యజమానులు పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో పోలీసులు వీటిని స్టేషనుకు తరలించారు. వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో తగు సమాచారాన్ని మండల మేజిస్ట్రేట్ బి.అప్పల స్వామికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయా వాహనాల పూర్తి సమాచారంతో వచ్చి సంప్రదించిన యెడల రుజువులు పరిశీలించి యజమానులకు అప్పగిస్తామని ఎస్సై మోహిని తెలిపారు.

# డిజిటల్ లైబ్రరీకి స్థల పరిశీలన

**మెళియాపుట్టి, సెప్టెంబరు 10(వార్త):** మెళియాపుట్టిలో నూతనముగా చేపట్టనున్న డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి గురువారం నాడు క్షేత్రస్థాయిని సందర్శించి పరిశీలించారు. టెక్కలి రోడ్డు మార్గంలో పాత తహసిల్దార్ కార్యాలయానికి నూతనముగా నిర్మాణం చేపట్టిన సచివాలయ ప్రాంగణానికి అనుకొని స్థలాన్ని ఇదివరకు పరిశీలించినప్పటికీ అక్కడ లైబ్రరీ నిర్మాణం చేపట్టినట్లయితే భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తవచ్చని పలువురు అభ్యంతరాలను వ్యక్తం చేయటంతో టెక్కలి ఆర్డీవో గురువారం నాడు సందర్శించి ప్రస్తుతం లైబ్రరీ ఉన్న స్థలంతో పాటు పాత తహసిల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న పక్కనున్న స్థల పరిశీలనతో పాటు మండల పరిషత్ కార్యాలయం వెనుకనున్న శిధిలావస్థలో ఉన్న భవనాన్ని స్థలాన్ని పరిశీలించి, నూతనముగా నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీకి ఇక్కడ నిర్మాణం చేపట్టేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు ఆర్డీఓ ఆదేశించారు. నూతనముగా నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీకి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు, సమీపంలో ఏర్పాటు కానున్న పెట్రోల్ బంక్ లను దృష్టిలో ఉంచుకుని సమగ్రంగా స్కెచ్ డిజైన్ లను రూపొందించి పంపించాలని స్థానిక ఇంచార్జ్ తహసిల్దార్ రాముకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణమూర్తి తో పాటు ఇంచార్జ్ తహసిల్దార్ రాము సర్వే డిపార్ట్మెంట్ నుండి నారాయణరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆశాలత, వీఆర్వో రాజ్‌కుమార్, విలేజ్ సర్వేయర్ చంద్ర, గ్రామస్తులు యువకులు ప్రజలు తదితరులున్నారు.



# పదిమందికి ఆదర్శం కావాలి

**- ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్**



**మెళియాపుట్టి, సెప్టెంబరు 10 (వార్త):** విద్యార్థులు తమ చదువుకున్న రోజుల్లో ఒక నిర్ణీత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక ఏకంగా ముందుకు సాగి ఉన్నత శిఖరాలు అధిరోహించి పదిమందికి ఆదర్శం కావాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. మండలంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ గురువారం నాడు సందర్శించి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, పాఠశాల నిర్వహణ తీరును తదితర వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతి గదులను సందర్శించిన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలు, వారికి అందుతున్న సౌకర్యాల తదితర వాటి గూర్చి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అక్కడ ఉన్న సమస్యలను పిఓ దృష్టికి తీసుకొని రాగా దీనిపై ఆయన స్పందిస్తూ వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రస్తుత ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య ఎంతో ముఖ్యమని, ఉపాధ్యాయులు కూడా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్శనలో పీవోతోపాటు పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తదితరులున్నారు.

# పెన్షన్ దరఖాస్తులకు వృద్ధుల అవస్థలు

**- సచివాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షణ**

**- సర్వర్, ఓటీపీ సమస్యలతో దరఖాస్తులకు జాప్యం**

**- సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని వృద్ధుల విజ్ఞప్తి**



**సారవకోట, సెప్టెంబరు 10 (వార్త):** సారవకోట మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో పెన్షన్ దరఖాస్తుల సమర్పణకు వచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రెండేళ్ల విరామం అనంతరం పెన్షన్ దరఖాస్తులకు అవకాశం కల్పించడంతో అర్హత ఉన్న వృద్ధులు పెద్ద సంఖ్యలో సచివాలయాలకు తరలివస్తున్నారు. అయితే దరఖాస్తుల స్వీకరణ సమయంలో సర్వర్ సమస్యలు తలెత్తడంతో ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. దీనికి తోడు ఓటీపీలు సకాలంలో అందకపోవడం, ఒక దరఖాస్తుకు పలుమార్లు ఓటీపీలు రావడం వంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఒక్కో దరఖాస్తు నమోదు చేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. దరఖాస్తుల కోసం ఉదయం నుంచే సచివాలయాల వద్దకు చేరుకుంటున్న వృద్ధులు తమ వంతు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వయోభారంతో ఉన్న వారు ఎక్కువసేపు క్యూలో నిలబడటంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుల ప్రక్రియ పూర్తికాకపోవడంతో కొందరు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్వర్ సమస్యలను పరిష్కరించి, ఓటీపీ ప్రక్రియను సులభతరం చేయాలని స్థానికులు కోరుతున్నారు. దరఖాస్తుల స్వీకరణకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను మెరుగుపరిచి, వృద్ధులకు వేగంగా సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జమ్ము కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు

**- పోలీసుల సూచనతో కెమెరాలు ఏర్పాటు చేసిన లారీ ఓనర్లు**

**- సీసీ కెమెరాలను పరిశీలించిన ఎస్సై గణేష్**

**- ప్రధాన రహదారిలోని ప్రతి దుకాణానికి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచన**



**నరసన్నపేట, సెప్టెంబరు 10 (వార్త):** నరసన్నపేట ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జమ్ము కూడలి వద్ద భద్రతను మరింత పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల స్థానిక లారీ ఓనర్లకు పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించగా, వారి సహకారంతో కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. పోలీసుల సూచన మేరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఎస్సై గణేష్ పరిశీలించారు. కెమెరాల పనితీరు, వాటి ఏర్పాటు చేసిన ప్రదేశాలను పరిశీలించి, భద్రతా పరంగా వాటి ఉపయోగాన్ని వివరించారు. ప్రజల భద్రతకు సహకరిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన లారీ యజమానులను ఈ సందర్భంగా ఎస్సై అభినందించారు. ప్రధాన రహదారిపై నిత్యం వాహనాల రాకపోకలు, ప్రజల సంచారం అధికంగా ఉండటంతో భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని ఎస్సై పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గుర్తించడంతో పాటు ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నప్పుడు దర్యాప్తులో సీసీ కెమెరాల దృశ్యాలు ఉపయోగపడతాయని తెలిపారు. నరసన్నపేట ప్రధాన రహదారిలో ఉన్న ప్రతి దుకాణ యజమాని కూడా తమ వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై గణేష్ సూచించారు. పోలీసులకు ప్రజలు, వ్యాపారులు సహకరిస్తే పట్టణంలో భద్రతను మరింత మెరుగుపరచవచ్చని ఆయన పేర్కొన్నారు.

# కామ్రేడ్ కుమార్, సీతారాముల త్యాగాలు స్ఫూర్తిదాయకం



**మందస, సెప్టెంబరు 10(వార్త):** అమాయక గిరిజనులు, రైతులు, కూలీలు, పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ కుమార్ అన్న, కామ్రేడ్ సీతారాముల త్యాగాలు ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని జనశక్తి సంఘ నాయకుడు కోనేరు రమేష్ అన్నారు. మందస మండలం కుసుమల పంచాయతీ బలియాగాం గ్రామంలో గురువారం కామ్రేడ్ కుమార్ అన్న, సీతారాముల 28వ వర్ధంతి సందర్భంగా సంతాప సభ నిర్వహించి అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోనేరు రమేష్ మాట్లాడుతూ అమాయక గిరిజన ప్రజల భూమి, భుక్తి, విముక్తి కోసం నిస్వార్థంగా పోరాడిన ప్రముఖ నాయకుల్లో కామ్రేడ్ కుమార్ అన్నది ప్రత్యేక స్థానం అన్నారు. గిరిజన రైతాంగ పోరాటాలకు ఆయన నాయకత్వం వహించి, భూమిలేని గిరిజనులకు భూమి సాధించేందుకు ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. కామ్రేడ్ కుమార్ అన్న నాయకత్వంలో మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం, పలాస, మందస తదితర ప్రాంతాల్లో గిరిజన భూ పోరాటాలు జరిగాయని, ఆ పోరాటాల ద్వారా వేలాది ఎకరాల భూమిని సాధించి గిరిజన ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర ఉందని కోనేరు రమేష్ పేర్కొన్నారు. నాటి పోరాటాల ఫలితంగా సాధించిన భూముల్లో నేటికీ అనేక మంది గిరిజనులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. గిరిజనులు తమ భూములు, జీవనాధారం, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చిన కుమార్ అన్న ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ అనేక మంది గిరిజనులు భూమి, ఉపాధి, ఇళ్ల స్థలాలు, సాగు హక్కులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కామ్రేడ్ కుమార్ అన్న, కామ్రేడ్ సీతారాముల త్యాగాలను స్మరించుకుంటూ గిరిజనులు, రైతులు, కూలీలు, పేద ప్రజల హక్కుల కోసం పోరాడటమే వారికి అందించే నిజమైన నివాళి అని కోనేరు రమేష్ అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్, మాధవరావు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పెన్షన్లు నమోదు చేయించండి



**మందస, సెప్టెంబరు 10(వార్త):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా అర్హులందరికీ కొత్త పెన్షన్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 16వ తేదీ వరకు అవకాశం ఇచ్చినందున గ్రామాలలో అర్హులందరికీ అవగాహన కల్పించి సకాలంలో నమోదు చేయించాలని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు.

స్థానిక మండల సమాఖ్య కార్యాలయం లో మండల మహిళా సమాఖ్య కోశాధికారి మెట్ట శారదమ్మ ఆధ్వర్యంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయంలో పెన్షన్ దార్లు కు అసౌకర్యం లేకుండా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఎంటర్ ప్రైనర్ గ్రౌండింగ్ చేయించి సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్ లాగిన్ లో ఎస్సెట్ టాగింగ్ అయ్యేటట్లు వీడియో తీసి అప్లోడ్ చేయించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో కిచెన్ గార్డెన్,న్యూట్రీ గార్డెన్స్ విరివిగా వేయించి ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో అన్ని గ్రామాల్లో కూడా నిరక్షరాస్యులైన లెర్నర్స్ కు అదే గ్రామంలో విద్యావంతులైన వాలంటీర్స్ తో చదువు నేర్పించి అన్ని సామాజిక కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, లీగల్ లిటరసీ, హెల్త్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ మహిళా సంఘాలలో అక్షరాస్యత ప్రాధాన్యత తెలియజేయాలని సూచించారు. మహిళా సంఘాలకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజ్ తో వివిధ జీవనోపాదులు, జెండర్ యాక్టివిటీ లపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ సాయిరాం,లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, అకౌంటెంట్లు కళ్యాణి, భాగ్యలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కొర్ల కన్నారావుకు ఘనంగా సన్మానం

**మందస, సెప్టెంబరు 10(వార్త):** బిన్నళమదనాపురంలో కొర్ల కన్నారావుకు ఘనంగా సన్మానం జరిగింది. అరసవల్లి శ్రీసూర్యానారయణస్వామి దేవాలయం బోర్డు మెంబర్‌గా కన్నారావు పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా బిన్నల గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీరాములవారి దేవాలయంలో పంచాయతీ పెద్దలు మార్పు వెంకటేశం, కన్నారావు స్నేహితులు, అభిమానులు కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నారావు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. సీనియర్ నాయకునిగా అందరికీ మార్గదర్శకులయ్యారన్నారు. సమాజ సేవకునిగా, ఆధ్యాత్మిక వేత్తగా కన్నారావు ఎన్నో మంచి పనులు చేస్తున్నారన్నారు. అరసవల్లి దేవాలయ ట్రస్ట్ సభ్యునిగా నియామకం సందర్భంగా కొర్ల కన్నారావుపై మరింత బాధ్యతలు పెరిగాయన్నారు. అనంతరం కొర్ల కన్నారావు, కవిత దంపతులు మాట్లాడుతూ ప్రజలు తమపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసూర్యనారాయణస్వామి సేవకు అంకితమవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన మన్మధరావు, బొడ్డ ధనుంజయ రావు, మార్పు విక్రమ్, మార్పు మన్మధరావు, మార్పు మధుసూదనరావు, గుంట చక్రపాణి, ఇప్పిలి చంద్రశేఖర్, సుదర్శనరావు, బాబురావు, కొంచాడ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గుడి-బడి.. ఆధ్యాత్మిక బాటలో చిన్నారులు

**చిన్న తిరుపతి దేవాలయాన్ని సందర్శించిన శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు**



**పలాస, సెప్టెంబరు 10 (వార్త):** గుడి-బడి కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి విద్యావిహార్, రామకృష్ణపురం ప్రీ-ప్రైమరీ విద్యార్థులు గురువారం స్థానిక చిన్న తిరుపతి దేవాలయాన్ని సందర్శించారు. పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక క్షేత్ర సందర్శనలో 201 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేవాలయంలో సామూహికంగా గోవింద నామస్మరణ చేశారు. చిన్నారుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు, ఆలయానికి వచ్చిన సందర్శకులను ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయసులోనే విద్యార్థులను దేవాలయాలకు తీసుకెళ్లడం ద్వారా వారిలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించవచ్చన్నారు. విద్యతోపాటు సంస్కారం, ఆధ్యాత్మిక విలువలను అలవర్చడం ద్వారా 'గుడి-బడి ఒక్కటే' అనే భావనను చిన్నారుల్లో నాటవచ్చని తెలిపారు.

ఈ ఆధ్యాత్మిక క్షేత్ర సందర్శనలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు అనుదీప్, కల్పన, కళ్యాణి, ప్రియాంక, వనిత, కుమారి, జ్యోతి, ఆషా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

# గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి!

**- రోడ్లను ఆక్రమిస్తే అనుమతి లేదు**

**-డీజేలు, అధిక శబ్దంపై ఆంక్షలు**

**-నిమజ్జనంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే**

**-పలాస సబ్‌డివిజన్‌లో పోలీసుల అప్రమత్తత**

**- డీఎస్పీ భవానీ కీలక ఆదేశాలు**



**పలాస, సెప్టెంబరు 10 (వార్త):** గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు ఊపందుకుంటున్న నేపథ్యంలో పలాస సబ్‌డివిజన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వినాయక మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కాశీబుగ్గ డీఎస్పీ భవానీ నిర్వాహకులకు స్పష్టం చేశారు. అనుమతులు తీసుకోకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల పేరుతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా రహదారులను ఆక్రమించడం, అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం, నిమజ్జన ఊరేగింపుల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు. ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, గణేష్ మండపాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. పోలీస్, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక తదితర సంబంధిత శాఖల నిబంధనలను పాటించి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే మండపాల ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అనుమతుల ప్రక్రియను చివరి నిమిషం వరకు వాయిదా వేయకుండా నిర్వాహకులు ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులకు అడ్డంగా మండపాలు వద్దని, ప్రధాన రహదారులు, కీలక కూడళ్లు, అధిక ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగించేలా మండపాలు ఏర్పాటు చేస్తే అనుమతులు ఇవ్వబోమని పోలీసులు స్పష్టం చేశారు. మండపాల వల్ల అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర సేవల వాహనాలకు మార్గం మూసుకుపోకుండా స్థల ఎంపిక చేయాలని సూచించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఏర్పాట్లకు అనుమతి ఉండదన్నారు. డీజేలు.. శబ్ద కాలుష్యంపై నిఘా ఏర్పాటు చేసి గణేష్ ఉత్సవాల్లో డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న శబ్ద నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ భవానీ తెలిపారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, ముఖ్యంగా రాత్రి వేళల్లో శబ్ద పరిమితులను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తి కార్యక్రమాల పేరుతో శబ్ద కాలుష్యానికి కారణం కాకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిమజ్జనానికి ప్రత్యేక ప్రణాళిక చేసుకోవాలని, వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిమజ్జన ఊరేగింపుల మార్గాలు, సమయాలు, వాహనాల రాకపోకలకు సంబంధించి పోలీసులు ఇచ్చే సూచనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఊరేగింపుల సమయంలో రహదారులను పూర్తిగా దిగ్బంధించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసే మార్గదర్శకాలను ఉల్లంఘించకుండా భక్తులు, నిర్వాహకులు సహకరించాలని సూచించారు.మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, వైర్లు, లైటింగ్ ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని పోలీసులు సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనలకు అనుగుణంగా కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు షార్ట్‌సర్క్యూట్ తదితర ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిర్వాహకులు, భక్తులు పోలీస్ శాఖకు సహకరించాలని డీఎస్పీ భవానీ కోరారు. ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావులేకుండా ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తే అందరికీ ఇబ్బందులు లేకుండా పండుగను విజయవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని, ఉత్సవాల సందర్భంగా చట్టం, ట్రాఫిక్, శబ్ద కాలుష్యం, విద్యుత్, అగ్నిమాపక భద్రతకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భవానీ స్పష్టం చేశారు. భక్తి, ఉత్సాహంతో పాటు ప్రజా భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో సీఐలు రామకృష్ణ, తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**మందస, సెప్టెంబరు 10(వార్త):** విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల కుమార్ కళాశాలలో గురువారం నారీశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులకు మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, సాధికారతపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ శాఖ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.









# ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదు!

**- సమస్య వచ్చినప్పుడు సహాయం కోరడం బలహీనత కాదు.. ధైర్యం**

**-యువతలో ఒత్తిడిని గుర్తించి అండగా నిలవాలి**

**-ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో అవగాహన**

**పలాస, సెప్టెంబరు 10 (వార్త):** సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మహత్య ఆలోచనలకు లోనుకాకుండా, వాటిని అధిగమించేందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, వైద్యులను సంప్రదించాలని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాపినాయుడు తెలిపారు. "ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదు.. సమస్య వచ్చినప్పుడు సహాయం కోరడం బలహీనత కాదు.. అది ధైర్యం" అని తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా గురువారం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలోని ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాపినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ, మానసిక ఒత్తిడిని గుర్తించడం, బాధితులకు సకాలంలో సహాయం అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపినాయుడు మాట్లాడుతూ యువతలో చదువు, ఉద్యోగం, ప్రేమ, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, వైఫల్యాలు తదితర కారణాలతో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఒత్తిడి తీవ్రంగా ఉన్న సమయంలో తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా, నమ్మకమైన వ్యక్తితో మనసు విప్పి మాట్లాడాలని సూచించారు. అవసరమైతే వైద్యుడు లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించాలని తెలిపారు. సూచనలను నిర్లక్ష్యం చేయవద్దని, యువతలో తీవ్రమైన నిరాశ, ఇతరులకు దూరంగా ఉండటం, నిరాశాజనకంగా మాట్లాడటం వంటి మార్పులను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు గుర్తించాలని వైద్యులు సూచించారు. "బతకాలని లేదు" వంటి మాటలను సరదాగా తీసుకోకుండా, వాటి వెనుక ఉన్న బాధను అర్థం చేసుకుని సానుభూతితో వినాలని తెలిపారు. ఇలాంటి సమయంలో విమర్శించడం, నిందించడం కాకుండా అండగా నిలిచి అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని సూచించారు. మానసిక సమస్యలను కూడా ఇతర ఆరోగ్య సమస్యల మాదిరిగానే పరిగణించాలని, సహాయం కోరడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. కుటుంబం, విద్యాసంస్థలు, స్నేహితుల వర్గం సమన్వయంతో పనిచేస్తే యువతలో ఒత్తిడిని ముందుగానే గుర్తించి తగిన సహాయం అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ రఘురాం, డాక్టర్ చిన్ని నాయుడు, డాక్టర్ మేఘన, డాక్టర్ సుశీల, డాక్టర్ మనోహర్, డాక్టర్ రేఖ, డాక్టర్ రమ్య, డాక్టర్ వినోద్, డాక్టర్ తరుణ్, డాక్టర్ జ్యోత్స్నప్రియ, డాక్టర్ చాందిని, డాక్టర్ స్వరూప్, ఆసుపత్రి మెడికల్ కౌన్సిలర్ బగాతి శ్రీకాంత్, హెడ్ నర్స్ ఉమాదేవి, శోభారాణి, పలువురు ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలి

**-రబీకి స్వల్పకాలిక విత్తనాలు ఉచితంగా అందించాలి**

**- ఉపాధి హామీలో 200 రోజులు పనిదినాలు కల్పించాలి**

**- రోజువారీ కూలి రూ.600కు పెంచాలని రైతు సంఘం డిమాండ్**

**పలాస, సెప్టెంబరు 10 (వార్త):** శ్రీకాకుళంను కరువు జిల్లాగా ప్రకటించి, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మాకనపల్లి గ్రామ సచివాలయ అధికారులకు గురువారం సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని వారు తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు. రబీ సీజన్‌లో రైతులకు అనుకూలంగా ఉండే ప్రత్యామ్నాయ స్వల్పకాలిక విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న తక్కువ వ్యవధిలో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రోజువారీ కూలిని రూ.600కు పెంచి, అర్హులైన ప్రతి కుటుంబానికీ నిరంతరం పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు పరిస్థితులను కేవలం పంట నష్టానికే పరిమితం చేయకుండా రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కుటుంబాలపై పడుతున్న ఆర్థిక ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని సమగ్ర సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు, కూలీలకు ఉపశమన చర్యలు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెప్పల అజయ్‌కుమార్, సాలిన వీరస్వామి, కోరాడ లింగమూర్తి, బత్తిని ప్రసాద్, తెప్పల రాజు, బత్తిన దుర్యోధన, సాలిన కోదండరావు, జుత్తు లోకనాథం, ఎం. జీవన్‌రావు, గతం ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

## 67 పోలింగ్ కేంద్రాల

# డ్రాఫ్ట్ జాబితా విడుదల

**పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో 36 వార్డులకు ఏర్పాట్లు**

**- ఎన్నికల ప్రక్రియలో మరో ముందడుగు**

**పలాస, సెప్టెంబరు 10 (వార్త):** పలాస పురపాలక సంఘం సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 36 వార్డులకు సంబంధించిన 67 పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాను గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ జాబితాను పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు విడుదల చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 36 వార్డులకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి పరిధి, ఓటర్లకు అందుబాటులో ఉండే సౌకర్యాలు వంటి అంశాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో ప్రాధాన్యం ఏర్పడింది. పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం సంబంధిత వార్డుల ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు జాబితాను పరిశీలించవచ్చునని, ఏదైనా అభ్యంతరం లేదా సూచన ఉంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో అధికారుల దృష్టికి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని కమిషనర్ తెలిపారు. అందిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం తుది పోలింగ్ కేంద్రాల జాబితా ఖరారు చేసే ప్రక్రియ కొనసాగనుందని ఆయన తెలిపారు. 36 వార్డులకు 67 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నేపథ్యంలో ప్రతి వార్డులో ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిధి, పోలింగ్ కేంద్రానికి ఓటర్లు సులభంగా చేరుకునే పరిస్థితులు వంటి అంశాలు ఎన్నికల నిర్వహణలో కీలకంగా ఉండనున్నాయి. తుది జాబితా ఖరారైన తర్వాత ఎన్నికల నిర్వహణకు అవసరమైన తదుపరి ఏర్పాట్లు వేగం పుంజుకునే అవకాశం ఉందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదలతో పలాస--కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయి ఏర్పాట్లు అధికారికంగా ముందుకు సాగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇకపై అభ్యంతరాల పరిశీలన, తుది పోలింగ్ కేంద్రాల జాబితా ఖరారు తదితర ప్రక్రియలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. అధికారుల సమన్వయంతో డ్రాఫ్ట్ జాబితా విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్లు నరసింహారావు, త్రినాధరావు, డీఈఈ శ్రీకర్, ఏఈఈ సత్యనారాయణ, రెవెన్యూ అధికారి మౌనిష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు హర్ష, రమణ, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# పింఛన్ల దరఖాస్తుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి

**- కాంగ్రెస్ నేతల డిమాండ్**

**- లబ్ధిదారులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం సరికాదని ఆగ్రహం**

**- పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్**

**- అక్రూలాలకు పాల్పడితే కలెక్టర్‌కు ఫిర్యాదు, న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిక**

**జలుమూరు, సెప్టెంబరు 10 (వార్త):** పింఛన్ల మంజూరు ప్రక్రియలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నివారించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పింఛన్ దరఖాస్తుదారులను రాజకీయ ప్రయోజనాల కోసం ప్రలోభాలకు గురిచేయడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలను అరికట్టాలని కోరారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని రాజీవ్ భవన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకుడు, 2024 శ్రీకాకుళం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్, శ్రీముఖలింగం మాజీ ఉపసర్పంచ్, జలుమూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుంట కరణవీరుడు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ల మంజూరుకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో శ్రీముఖలింగం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొంతమంది లబ్ధిదారుల నుంచి దరఖాస్తు జిరాక్స్ ప్రతిని తమకు సమర్పించాలని స్థానిక టీడీపీ నాయకులు కోరుతున్నారని పలువురు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తమకు ఒక సెట్ అందించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఓటు వేస్తామని చెబితే పింఛన్ మంజూరవుతుందని కొందరు చెప్పినట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ తరహా ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, సంక్షేమ పథకాల అమలుకు విరుద్ధమని నాయుడుగారి రాజశేఖర్ అన్నారు. పింఛన్ అనేది అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ ప్రయోజనమని, దానిని రాజకీయ ప్రయోజనాలతో ముడిపెట్టడం తగదని పేర్కొన్నారు. జలుమూరు మండలంతో పాటు పోలాకి, నరసన్నపేట, సారవకోట మండలాల్లోనూ ఇలాంటి ఫిర్యాదులు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత పరిశీలనను సచివాలయ సిబ్బంది, సంబంధిత మండల స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పింఛన్ లబ్ధిదారులను రాజకీయంగా ప్రభావితం చేయడం లేదా అర్హత కలిగిన వారికి అన్యాయం చేసే ప్రయత్నాలు జరిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు అవసరమైతే జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి, న్యాయపరమైన చర్యలకు కూడా వెళ్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గతంలోనూ పింఛన్ల విషయంలో న్యాయస్థానాలను ఆశ్రయించి లబ్ధిదారులకు న్యాయం జరిగిన సందర్భాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల పోలాకి మండలంలో కోర్టు ఆదేశాల ద్వారా ఓ వితంతు మహిళకు పింఛన్ విషయంలో న్యాయం జరిగిందని వారు గుర్తుచేశారు. సంక్షేమ పథకాల విషయంలో అర్హులైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో శ్రీముఖలింగం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోహన్ కోటేశ్వరరావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలి

**- సమరశీల పోరాటమే కుమారన్నకు నిజమైన నివాళి**

**- పెదగంతరులో కుమారన్న సీతారాముల 28వ వర్ధంతి సభ**




**పలాస, సెప్టెంబరు 10 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలను నిర్మించడమే అమరవీరులు కుమారన్న, సీతారాముల ఆశయాలకు నిజమైన నివాళి అని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. సాయుధ పోరాటం ద్వారా దేశ విముక్తి సాధించాలనే లక్ష్యంతో తమ జీవితాలను అంకితం చేసిన కుమారన్న, సీతారాముల ఆశయాలను కొనసాగించేందుకు ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పలాస మండలం పెదగంతరు ఆదివాసీ గ్రామంలో గురువారం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కుమారన్న, సీతారాముల 28వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాజశేఖర్ మాట్లాడుతూ అమరవీరుల పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలంటే ప్రజల జీవన సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కార్పొరేట్ విధానాలపై పోరాటాలు అవసరమని, దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని రాజశేఖర్ విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరులు కలలుగన్న సమాజ నిర్మాణం కోసం ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించడమే వారి పోరాట వారసత్వాన్ని కొనసాగించడమని తెలిపారు. ఎర్రజెండా ఆవిష్కరణ చేస్తూ సభకు ముందు పెదగంతరు గ్రామ పురవీధుల్లో అమరవీరులను స్మరించుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కుమారన్న కుమారుడు పోతనపల్లి మల్లేశ్వరరావు ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం కుమారన్న, సీతారాముల చిత్రపటాలకు వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యుడు సవర బంగ్లా కుమార అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకుల నివాళి అర్పించారు. పలు ప్రజా సంఘాలకు చెందిన పి.కామేశ్వరరావు, వడ్డాది మల్లేశ్వరరావు, సార జగన్ (పీవైఎల్), జడే అప్పయ్య (ఏఐకేఎంఎస్), పోతనపల్లి మల్లిబాబు తదితరులు మాట్లాడారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**పోరాట స్ఫూర్తి కొనసాగాలంటూ...**

కుమారన్న, సీతారాముల వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ద్వారా వారి పోరాట నేపథ్యాన్ని స్మరించుకోవడంతోపాటు, ప్రస్తుత ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరాన్ని వక్తలు ప్రస్తావించారు. ప్రజా సంఘాలు, కార్మిక, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించార.

ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, ఐఎఫ్‌టీయూ శ్రీకాకుళం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి సవలాపురపు కృష్ణవేణి, ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, అరుణోదయ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు సొర రామారావు, ఉపాధ్యక్షుడు వంకల రాజారావు (నిశితాసి), సాహితీ మిత్రులు, ప్రజా కళాకారుడు కుత్తుం వినోద్, ప్రజా కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నీలకంఠం, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**-విధుల్లో మరణించిన ప్రతీ కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**



**మందస, సెప్టెంబరు 10(వార్త):** ఆంధ్రప్రదేశ్ మెడికల్, హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ పిలుపులో భాగంగా మందస మండలంలోని హరిపురం సామాజిక ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగులు కళ్ళకు గంతలు ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ లక్ష్మి మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులకు అర్హత బట్టి బదిలీ, మ్యూచువల్ ట్రాన్స్ఫర్ ను అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రేడియోగ్రాఫర్ సంతోష్ కుమార్, స్టాఫ్ నర్స్ గీత, రోజా, ల్యాబ్ టెక్నీషియన్ మల్లేష్, ధనలక్ష్మి, ఫార్మసిస్ట్ జీవిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవం




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరిగింది. ఈ సభకు స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహిస్తూ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10 వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటారు. ఆత్మహత్యలను నివారించడం, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం దీని ముఖ్య ఉద్దేశ్యంఆత్మహత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఆత్మహత్యకు ముందు ప్రవర్తనల గురించి అవగాహన పెంచడానికి, వాటిని ఎలా సమర్థవంతంగా నిరోధించాలో తెలియజేయడానికి ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ బహుళ-రంగ కార్యకలాపాల సంస్థ ఏర్పాటుచేయాలని, ఆ సంస్థ ద్వారా జాతీయ విధానాలు, ఆత్మహత్యల నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అంచనా వేయడానికి దేశాల సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది అని తెలియజేసారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ,శంకర్, శాంతి, పద్మజ, రవి, శ్రీధర్, జయలక్ష్మి, యశోద, మీనా, పార్వతి, ప్రమీల, సరోజినీ, రాజేశ్వరి బి. యర్రమ్మ, ఆశవర్కర్స్ యస్. సరోజినీ, కె. రామలక్ష్మి ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి.హర్షవర్ధన్ రెడ్డి సెక్రటరీ డి. భార్గవ్, ఎస్. పి. ఎల్ స్వాతి పాల్గొన్నారు.

## పింఛన్ల దరఖాస్తులకు సర్వర్ సమస్యలు

**నరసన్నపేట, సెప్టెంబరు 10 (వార్త):** నూతనంగా అర్హత పొందిన వృద్ధులు,



దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులైన వారు తమ దరఖాస్తులను సమర్పిస్తున్నారు. అయితే సచివాలయాల ఆన్‌లైన్ వ్యవస్థలో సర్వర్ మందగమనంతో దరఖాస్తుల నమోదు ప్రక్రియకు తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు సిబ్బంది తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సర్వర్ అందుబాటులో లేకపోవడం లేదా నెమ్మదిగా పనిచేయడం వల్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. దీంతో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సచివాలయాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా దరఖాస్తు నమోదు ప్రక్రియలో అవసరమైన ఓటీపీ సమయానికి అందకపోవడం మరో సమస్యగా మారింది. మొబైల్‌కు ఓటీపీ వచ్చిన తర్వాతే సంబంధిత వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుందని సచివాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు. సర్వర్ సమస్యతో పాటు ఓటీపీ ఆలస్యం కావడంతో దరఖాస్తుదారులకు మరింత నిరీక్షణ తప్పడం లేదని తెలిపారు. ప్రభుత్వం కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు కోరిన నేపథ్యంలో అర్హులైన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియ సజావుగా జరిగేలా సర్వర్ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎక్కువసేపు సచివాలయాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వినాయక చవితికి శుభరాట

**సోంపేట, సెప్టెంబరు 10 (వార్త):** కొర్లాం గ్రామం గొనకపాడు వీధిలో రానున్న వినాయక చవితి మహోత్సవ సందర్భంగా సిద్ధాంతి పూర్ణ చంద్ర ఆధ్వర్యంలో పూజా కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు మంత్రోచ్చారణల మధ్య గురువారం శుభరాట వేశారు. వినాయకుని కృపాకటాక్షములచే గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆశాభావాన్ని వ్యక్తం జేశారు. ఈ కార్యక్రమంలో రాంబుడ్డి గణపతి, పెద్దింటి మీనారావు, రాంబుడ్డి గంగారావు, రాంబుడ్డి బాబురావు,మాల్యాడ యాదవరావు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10(వార్త):** ఇన్ సర్వీస్ టీచర్ లకు టెట్ పరీక్ష రద్దు చేయాలని, ఐఆర్, ప్రకటించాలని , డి ఏ బకాయిలు చెల్లించాలని ఇచ్ఛాపురం మండలం పర్యటనలో ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పప్పల తిరుమలరావు లు డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురం మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏపిటిఎఫ్.ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యా హక్కు చట్టానికి ముందు ఉపాధ్యాయ ఉద్యోగంలో నియమించబడిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు చావలి శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి పప్పల తిరుమలరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు అప్పటికి ఉన్న నిబంధనలు మేరకు అన్ని అర్హతలు పొంది ఉపాధ్యాయ నియామకం పొందారని, ఇప్పుడు టెట్ పరీక్ష పాస్ అవ్వాలని రెట్రాస్పెక్టివ్ గా అమలు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్లో ఉన్న వివిధ ఆర్థికపరమైన అంశాలను ప్రభుత్వం విస్మరించిందని పనిభారాన్ని పెంచుతూ బోధనకు దూరం చేసే యాప్ల రద్దును కోరుతున్నామని ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఇచ్ఛాపురం మండల శాఖ అధ్యక్షులు చింతాడ శ్రీహరి, ప్రధాన కార్యదర్శి జాడు నాగేశ్వరరావు, ఈ మేరకు ఒక ప్రకట విడుదల చేశారు. ఈరోజు జిల్లా అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం మండలం , బలరాంపురం, ధర్మపురం, ఈదుపురం, లొద్దపుట్టి, కె శాసనం, జగన్నాధపురం, కొలిగాం ,మండపల్లి, బూర్జిపాడు మరికొన్నిపాఠశాలలో సందర్శనలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు తెలుసుకున్నారు. ఉద్యోగుల జిల్లాల వారి విభజన ప్రక్రియ ఆలస్యం అవుతున్నది కనుక వెంటనే ప్రమోషన్ అర్హత కలిగిన



ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు సంవత్సరాల కాల పరిమితి దాటినప్పటికిని, పి ఆర్ సి లేదు కనుక తక్షణమే 30% మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్లో ఉన్న డి ఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.తిరుమలరావు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఒక నిబద్ధతగల వైఖరితో పనిచేస్తుందని సభ్యులు తెలియజేశారు. సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. . ద

విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యం అన్నారు. ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చావలి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి పి తిరుమలరావు, జిల్లా కార్యదర్శి ఎస్ చాణక్య, సీనియర్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, మండల అధ్యక్షులు చింతాడ శ్రీహరి ప్రధాన కార్యదర్శి జాడు నాగేశ్వరరావు , సీనియర్ నాయకులు సదాశివుని శంకరరావు, కె పాపారావు, కెల్లి మోహన రావు మొదలగువారు పాల్గొన్నారు.

## విద్యార్థుల హోంవర్క్‌ను రోజూ పరిశీలించాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 10 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రతిరోజూ విద్యార్థుల హోంవర్క్‌ను పరిశీలించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) దాలినాయుడు సూచించారు. గురువారం నరసన్నపేట మండలం పోతయ్యవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూర్తి చేసిన హోంవర్క్‌ను ఎంఈవో స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు పాఠ్యాంశాలను ఏ మేరకు అర్థం చేసుకుంటున్నారో తెలుసుకున్నారు. చదువులో మరింత శ్రద్ధ కనబరచాలని, ఉపాధ్యాయులు ఇచ్చే ఇంటి పనులను క్రమం తప్పకుండా పూర్తి చేయాలని విద్యార్థులకు సూచించారు. ద

అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడిన ఎంఈవో దాలినాయుడు విద్యార్థుల అభ్యసనలో హోంవర్క్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులు చేసే హోంవర్క్‌ను పరిశీలించి, తప్పులను గుర్తించి అవసరమైన సవరణలు, సూచనలు అందించాలని అన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న వర్క్‌బుక్‌లను కూడా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని నిరంతరం గమనించడం ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు సహాయం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో దాలినాయుడు సూచించారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక

**- సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నరసన్నపేట పీఎం శ్రీ పాఠశాల విద్యార్థుల ఎంపిక - ఎం. రాజేశ్వరి, నిహారిక, పి. రోహిత్‌లకు హెచ్‌ఎం అభినందనలు**

**- బొబ్బిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు**

**నరసన్నపేట, సెప్టెంబరు 10 (వార్త):** రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నరసన్నపేట పీఎం శ్రీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రూపవతి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎం. రాజేశ్వరి, నిహారిక, పి. రోహిత్‌లను గురువారం పాఠశాలలో అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం హర్షం వ్యక్తం చేశారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో నిర్వహించనున్న ఈ పోటీలు రేపటి నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆమె తెలిపారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించి, విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. పాఠశాల తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందనలు తెలిపారు.



## చల్లవానిపేట జంక్షన్‌లో చేపల విక్రయాలతో ట్రాఫిక్ ఇబ్బందులు



**జలుమూరు, సెప్టెంబరు 10 (వార్త):** చల్లవానిపేట జంక్షన్ వద్ద రహదారి పక్కనే చేపల విక్రయాలు నిర్వహిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతపట్నం-నరసన్నపేట ప్రధాన రహదారిపై చేపల వ్యాపారం కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారులు రహదారి పక్కనే వాహనాలను నిలిపివేయడంతో పాటు వ్యాపారులు రోడ్డు మార్జిన్ వరకు దుకాణాలను ఏర్పాటు చేయడం వల్ల రహదారి అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలో ప్రయాణికుల రద్దీ పెరగడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు. ఒకవైపు ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు, మరోవైపు చేపల కొనుగోలుదారుల రద్దీ కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారులు, వినియోగదారులు నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చేపల విక్రయాలకు అనువైన ప్రదేశాన్ని కేటాయించడం లేదా రహదారికి ఇబ్బంది కలగకుండా వ్యాపారం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## జలుమూరు పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి



**జలుమూరు, సెప్టెంబరు 10 (వార్త):** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీకాంత్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా, సిబ్బంది విధుల నిర్వహణ ఎలా ఉంది తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రసవ సేవలు అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలకు మరింతగా తెలియజేసి, గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని శ్రీకాంత్ స్పష్టం చేశారు. గర్భిణులకు అవసరమైన వైద్య సలహాలు, సేవలు సకాలంలో అందిస్తూ ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల పెంపునకు తీసుకుంటున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## కోమర్తిలో పొలంబడి

**నరసన్నపేట, సెప్టెంబరు 10 (వార్త):** కోమర్తి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగులో రైతులు ఎదుర్కొనే చీడపీడల సమస్యలు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి సూర్యకుమారి మాట్లాడుతూ వరి పంటను వివిధ దశల్లో ఆశించే చీడపీడలను గుర్తించి, వాటి తీవ్రతను బట్టి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరం లేకుండా పురుగుమందులను వినియోగించకుండా, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులను మాత్రమే సరైన మోతాదులో ఉపయోగించాలని తెలిపారు. పంట పొలాల్లో సహజంగా ఉండే మిత్ర పురుగులు పంటకు ఉపయోగపడతాయని, వాటిని సంరక్షించడం ద్వారా చీడపీడల నియంత్రణకు అవకాశం ఉంటుందని వివరించారు. పురుగుమందులను పిచికారీ చేసే సమయంలో రైతులు తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని, గాలి దిశను గమనించి పిచికారీ చేయడంతో పాటు సూచించిన మోతాదును మించరాదని సూచించారు. పంట ఆరోగ్యాన్ని కాపాడుతూ నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది అందించే సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ అధికారి కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546